క్లుప్తంగా

కలెక్టరేట్‌లోని సెక్షన్ల పరిశీలన



గుంటూరు వెస్ట్: కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్‌లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫర్నిచర్, సిబ్బంది గదుల లీకేజీలు, అనవసరంగా ఉన్న ఫర్నిచర్, మహిళల టాయిలెట్స్, ఏసీలు తదితర అంశాలను దాదాపు గంటసేపు పరిశీలించారు. ఇబ్బందులను ఆయా సెక్షన్ల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించే క్రమంలో లోపాలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆమె వెంట డీఆర్వో పెద్ది రోజా, డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డీఎస్‌ఓ కోమలి పద్మ పాల్గొన్నారు.

కృష్ణా నదీ యాజమాన్య బోర్డును విజయవాడలోనే ఏర్పాటు చేయాలి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసానికి వినతి


గుంటూరు వెస్ట్: కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ని విజయవాడలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు కేంద్ర వ్యవసాయ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం గుంటూరులోని కలెక్టరేట్‌లో కేంద్ర సహాయ మంత్రిని కలిసిన అనంతరం గోపాల కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిలో అంతర్భాగంగా ఉన్న విజయవాడలో ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే రాష్ట్రం నలుమూలలు ఉన్న రైతులకు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీణా కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై శనివారం డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీతం నృత్య పాఠశాల ఆధ్వర్యంలో వీణా కచేరి నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పాఠశాల నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కందాల శ్రీనివాస గోవిందరాజన్ వీణపై మా తాపీ గణపతి కీర్తనతో ప్రారంభించగా, పలువురు వాగ్గేయకారుల కీర్తన లను వీణపై పలికించారు. వీణ కచేరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై మార్పూరు హరిబాబు వాయిద్యా సహకారం అందించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో ఆషాఢమాస పౌర్ణమి సందర్భంగా శనివారం భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీగణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ మినిస్ట్రీరియల్ అసోసియేషన్ ఎన్నిక వాయిదా

నెహ్రూనగర్: గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక ఆదివారం జరగాల్సి ఉండగా కొన్ని కారణాలతో వాయిదా పడింది. మూడేళ్ల కాలపరిమితితో అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రస్తుతం పోలేశ్వరరావు వ్యవహరిస్తూ వచ్చారు. ఈ నెల 17వ తేదీతో అధ్యక్ష పదవికి మూడేళ్ల కాలపరిమితి పూర్తవ్వడంతో కొత్తగా ఎన్నిక నిర్వహించేందుకు మినిస్ట్రీయల్ సిబ్బంది నిర్ణయం తీసుకున్నారు. దీనికి సూపరింటెండెంట్ పద్మనాభరావును ఎన్నికల అధికారిగా నియమించుకున్నారు. ఈ నెల 15వ తేదీతో నామినేషన్లు స్వీకరించి 21వ తేదీన ఎన్నిక ప్రక్రియ నిర్వహించాలని తీర్మానించారు. అయితే నామినేషన్ల స్వీకరణలో కొన్ని తప్పులు దొర్లడంపై కొంత మంది సిబ్బంది దీనిని ప్రశ్నించారు. దీంతో 21న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. దీనికి తోడు ఎన్నికల అధికారిగా వ్యవహరించాల్సిన పద్మనాభరావు కూడా ఎన్నికల అధికారిగా ఉండనని చెప్పడంతో ఆదివారం జరగాల్సిన ఎన్నిక జరగలేదు. అయితే ఎన్నిక నిర్వహించేందుకు సిబ్బంది అంతా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. 139 మంది దాకా ఉన్న మినిస్ట్రీయల్ సిబ్బంది కొత్త అధ్యక్ష, కార్యదర్శి, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకోనున్నారు.

ఆధునిక జీవనశైలితో బ్రెయిన్ సమస్యలు

- నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యల గుర్తింపు
- వరల్డ్ బ్రెయిన్ డే రేపు



బ్రెయిన్ అవగాహన పోస్టర్

గుంటూరు మెడికల్: మనిషి దైనందిన జీవితంలో చేసే పనులన్నీ కూడా బ్రెయిన్ ద్వారానే జరుగుతాయి. జ్ఞానేంద్రియాలకు ఇది ముఖ్యమైన కేంద్రం. మెదడు పనిచేయకపోతే మనిషి జీవచ్ఛవం లెక్కే. శరీరంలోని కీలకమైన అవయవాలన్నీ కూడా మెదడు ఇచ్చే ఆదేశాల ద్వారానే పనిచేస్తుంటాయి. కొన్ని రకాల వ్యాధుల వలన, ప్రమాదాల్లో గాయపడటం వలన మెదడు దెబ్బతిని, మెదడు పనిచేయక మనిషి చనిపోవటం జరుగుతుంది. మెదడును పరిరక్షించుకోకపోతే ఎలాంటి అనర్థాలు వస్తాయి, మెదడు గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది జూలై 22న వరల్డ్ బ్రెయిన్ డే నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

మెదడు గురించి ఆసక్తికర విషయాలు

మనిషి శరీరంలో మొత్తం బరువులో రెండు శాతం బరువు బ్రెయిన్‌కు ఉంటుంది. 18 ఏళ్ల వయస్సు వచ్చే వరకు బ్రెయిన్ ఎదుగుతూ ఉంటుంది. పగలు కంటే రాత్రి వేళల్లోనే మెదడు ఎక్కువ యాక్టివ్‌గా పనిచేస్తుంది. శరీరం మొత్తం వినియోగించుకునే శక్తిలో 20 శాతాన్ని మెదడు వినియోగించుకుంటుంది. మెదడులో 75 శాతం నీరు ఉంటుంది. మెదడు 1300 నుంచి 1400 గ్రాముల బరువు కలిగి ఉంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల్లో 350 నుంచి 450 గ్రాముల బరువు ఉంటుంది.

మెదడుకు ఇబ్బందికర పరిస్థితులు...

ప్రమాదాల్లో తలకు గాయాలు, పక్షవాతం, మెదడులో ట్యూమర్లు ఏర్పడడం, పార్కిన్‌సన్స్ వ్యాధి, యాంగ్జైటీ, డెమెన్షియా, డిప్రెషన్ కారణాల వలన మెదడు దెబ్బతింటుంది. తలనొప్పి, వాంతులు అవడం, చూపులో తేడాలు, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి లోపించడం, ఏదైనా విషయాలపై ఏకాగ్రత చూపించలేకపోవడం, చెవిలో శబ్దాలు వినిపించడం, మనిషి అసాధారాణంగా ప్రవర్తించడం లాంటి లక్షణాలు కనిపిస్తే మెదడుకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయనే విషయం గుర్తించాలి.

ట్యూమర్స్‌పై అప్రమత్తంగా ఉండాలి....

మెదడులో ఏర్పడే కొన్ని గడ్డలు క్యాన్సర్‌గా మారి ప్రాణాలు తీస్తాయి. కొన్ని గడ్డలు ప్రమాదకరమైనవి కావు. ఆపరేషన్ చేసి తొలగించవచ్చు. బ్రెయిన్ ట్యూమర్ ఉన్నవారిలో ఫిట్స్ వస్తాయి. వైద్యుల సలహా మేరకు ఫిట్స్ రాకుండా మందులు వాడుతూ ఉండాలి. చేతులు, కాళ్లు పనిచేయకపోతే పక్షవాతం అని భావిస్తారు. బ్రెయిన్‌లో గడ్డ ఉండటం వల్ల కూడా ఇలా జరగవచ్చు. అన్ని వయస్సుల వారికి బ్రెయిన్ ట్యూమర్‌లు వస్తాయి. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ ద్వారా బ్రెయిన్ ట్యూమర్‌లను నిర్ధారిస్తారు.

పెరుగుతున్న బాధితులు...

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం వంద కోట్ల మందికి పైగా నగదు సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ముగ్గురిలో ఒకరు మెదడు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ప్రతి ఒక్కరూ తమ జీవిత కాలంలో ఒక్కసారైనా మెదడు సమస్యల బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగంలో ప్రతిరోజూ 150 మంది, న్యూరో సర్జరీ విభాగంలో వంద మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. గుంటూరుజిల్లాలో 50 మంది న్యూరాలజిస్టులు, న్యూరోసర్జన్లు ఉన్నారు. ప్రతిరోజూ వైద్యుని వద్దకు 20 నుంచి 30 మంది వివిధ రకాల మెదడు సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారు. చిన్న వయస్సు మొదలుకొని పెద్దవారి వరకు అందరికి బ్రెయిన్ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. ప్రాథమిక దశలోనే వీటిని గుర్తించే ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు నేడు అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరుగకుండా, తద్వారా బ్రెయిన్ డామేజీ జరగకుండా కాపాడుకోవచ్చు. బ్రెయిన్ సర్జరీల్లో ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. కీ హోల్ సర్జరీల ద్వారా బ్రెయిన్ పూర్తిగా ఓపెన్ చేయకుండానే ఆపరేషన్లు చేయడం ద్వారా చాలా త్వరితగతిన రోగులు కోలుకుంటున్నారు. న్యూరో నావిగేషన్ చికిత్స విధానాల ద్వారా అరుదైన ట్యూమర్‌లను చాలా సులువుగా తొలగించి ప్రాణాలు కాపాడుతున్నారు. అన్ని బ్రెయిన్ ట్యూమర్‌లకు ఆపరేషన్లు చేయాల్సిన పనిలేదు.

–డాక్టర్ బీజాపూరి చంద్రశేఖర్, న్యూరోసర్జన్, గుంటూరు

మెదడును జాగ్రత్తగా కాపాడుకోవాలి....



బ్రెయిన్ సంబంధిత సమస్యలపై ప్రజలకు, వైద్య వృత్తిలో ఉన్న వారికి అవగాన కోసం అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. బ్రెయిన్ వయస్సు పెరిగే కొద్ది అనేక ఆటుపోటులకు గురవుతోంది. బ్రెయిన్‌ను పదిలంగా కాపాడుకుంటే పదికాలాలు హాయిగా జీవితాన్ని కొనసాగించవచ్చు. ముఖ్యంగా ఒత్తిడికి గురి కాకూడదు. నిత్యం యోగా, ధ్యానం, శారీరక వ్యాయామాలు చేయాలి. మద్యపానం, ధూమపానంకు దూరంగా ఉండాలి. చేపలు, గుడ్లు, తాజా పండ్లు తీసుకోవాలి. మెదడు నిరంతరం పదునుగా పనిచేసేలా పజిల్స్ చేయటం, నూతన విషయాలు నేర్చుకోవటం చేయాలి.

–డాక్టర్ పమిడి ముక్కల విజయ, న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు

•ఇదేం శంకుస్థాపన!



శిలాఫలకం లేకుండా శంకుస్థాపన చేసిన పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

నగరపాలక సంస్థ అరండల్ పేట 10/3 లైన్‌లో రూ.40 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. సాధారణంగా పనులు చేపట్టేందుకు శిలాఫలకం వేసి లాంఛనంగా పనులు ప్రారంభించడం ఆనవాయితీ. శిలాఫలకం పనులు పూర్తి కాకుండానే స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి శిలాఫలకం రాయి లేకుండానే అధికారికంగా శంకుస్థాపన చేశారు. దీంతో నవ్వులపాలు అవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో నగర ప్రజలు పెదవి విరుస్తున్నారు.

– నెహ్రూ నగర్

బాలిక హత్య కేసులో నిందితుడిని గుర్తించాలి



నగరంపాలెం: దళిత బాలిక హత్యకు కారణమైన వ్యక్తి వెంటనే గుర్తించి, కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావుమాదిగ కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. బాలిక హత్యకు గురై వారం రోజులు గడిచిన, నిందితుడి ఆచూకీ గుర్తించకపోవడం బాధాకరమని చెప్పారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం, ఒకరికి ఉద్యోగం కల్పించేలా జిల్లా కలెక్టర్‌తో చర్చించాలని కోరారు. ఎంఎస్ఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు కూచిపూడి మోహన్‌మాదిగ మాట్లాడుతూ హత్య కేసును త్వరితగతిన ఛేదించాలని అన్నారు. తద్వారా బాధిత కుటుంబానికి న్యాయం చేయాల ని అన్నారు. జిల్లా ఎస్పీని కలసిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు ఉన్నం రాంబాబు, ఉన్నం చిన్నజాను ఉన్నారు.

రేషన్ డీలర్ల నగర నూతన కార్యవర్గం త్వరలో ఎన్నిక

గుంటూరు వెస్ట్: రేషన్ డీలర్ల సంఘం నగర శాఖను రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు వైపె ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర అధ్యక్షుడు తుమ్మల గాంధీ, ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని, కోశాధికారి పీటీఎల్ వరప్రసాద్‌తో పాటు మరొకొందరు కమిటీ సభ్యులు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంతో వారిని తొలగించామన్నారు. త్వరలోనే నూతన నగర కమిటీని ఎన్నుకుంటామని చెప్పారు.

ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయాలి

ఎమ్మెల్యే మాధవికి వినతి పత్రం అందజేత

లక్ష్మీపురం: ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి వినతి పత్రం అందజేశారు. స్థానిక శ్రీనివాసరావుతోటలోని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమెకు సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన విధంగా భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి జీఓ 17 ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 12 రకాల సంక్షేమ పథకాలు అమలుతో పాటు దారి మళ్లించిన నిధులను బోర్డుకు జమ చేసి 50 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. ఇసుక ఉచిత పథకంతో కార్మికులకు ఉపాధి లభించిందని హర్షం వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాధవి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునః ప్రారంభానికి, కార్మికుల సంక్షేమానికి నిరంతరం పని చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు డేగల వెంకటేశ్వర్లు, అరుణ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

డీఈఓకు ఏపీటీఎఫ్ విజ్ఞప్తి



డీఈఓ శైలజకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ (1938) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెళాంగణిరాజు, కె.నరసింహారావు విన్నవించారు. శనివారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పి.శైలజకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఎక్కువగా ఉన్న చోట్ల విద్యాబోధనకు తగిన సంఖ్యలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. గతంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల సందర్శనలో భాగంగా సంజాయిషీ పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులపై తదుపరి చర్యలను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. నూతనంగా ఉద్యోగోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు ప్రొబేషన్ డిక్లరేషన్ చేయాలన్నారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం సత్వరమే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఈఓను కలసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు, నాయకులు ఓగిబోయిన నాగార్జున, ఎం. భాస్కరరావు, కె.గోపి ఉన్నారు.

విద్యానగర్ పురవీధుల్లో సాయి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో భక్తులు

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా ఆరో రోజైన శనివారం స్వామికి పూల సేవ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరై, వివిధ పుష్పాలతో స్వామి వారిని సేవించారు. సాయంత్రం పుర వీధుల్లో గ్రామోత్సవం, ఇరువైపులా భక్తులు తాడు లాగుతూ ముందుకు కదిలారు. కోలాట భజనలు, సాయి సంకీర్తనలతో మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

ఫిరాయింపుల నిరోధక చట్టం ఉనికే ప్రశ్నార్థకం



మాట్లాడుతున్న న్యాయవాది వి.ఎస్.ప్రసాదరావు

లక్ష్మీపురం: ఫిరాయింపుల నిరోధక చట్టం (1985) ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని న్యాయవాది ముప్పాళ్ల వీఎస్ ప్రసాదరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన చర్చ గోష్టిలో మాట్లాడారు. దేశంలో స్థిరపడిన బలపడిన రాజకీయ సంస్కృతికి శాసనాలతో, విలువలతో నిమిత్తం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పత్రికల పదజాలంలో 'ఆపరేషన్ ఆకర్ష్‌లు, జంప్ జిలానీ'లు రాజకీయాల్లో భాగమైపోయాయన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య, విద్యావేత్త ఎస్.రవిబాబు, పి.భావన్నారాయణ, మల్లేశ్వరరావు చర్చలో పాల్గొని ప్రసంగించారు.

నెల్సన్ మండేలాకు నివాళి..

ప్రపంచ పౌరులందరూ నెల్సన్ మండేలాను ఆదర్శంగా తీసుకొని మనం జీవిస్తున్న ప్రపంచాన్ని ప్రభావితం చేయటానికి, మార్చటానికి మనలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ సదాశివం, శివ, ప్రకాష్ పాల్గొన్నారు.

గురువులను గౌరవించుకోవడం భారతీయ సంస్కృతి



ఎస్వీ రమణను సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: గురువులను గౌరవించుకోవడం అనే సంప్రదాయం భారతీయ సంస్కృతిలో ఇమిడి ఉందని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ అన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో గురుపౌర్ణమి వేడుకలను శనివారం నిర్వహించారు. విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్రరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ విద్యను నేర్చుకోవాలంటే అది గురువు ద్వారానే సాధ్యమని, గురువు లేకుండా నేర్చుకునే విద్యకు పరమార్థం ఉండదన్నారు. తల్లిదండ్రుల కంటే మిన్నగా గురువులను గౌరవించుకునే సంస్కృతి, సంప్రదాయం భారతీయ వ్యవస్థలో ఉందని చెప్పారు. ప్రపంచానికి గురు శబ్దాన్ని అందించిన ఘనత భారత దేశానికి చెందుతుందని అన్నారు. ప్రస్తుత విద్యావ్యవస్థలోని లోటుపాట్లను వివరిస్తూ విద్యార్థులు నైపుణ్యాలతో కూడిన విద్యను నేర్వాలని, ఎల్లప్పుడే గురువులను గౌరవించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా ఎస్వీ రమణను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.హేమాంబ, సీహెచ్ కృష్ణ, ఉషశ్రీ పాల్గొన్నారు.

ఆదర్శ గురువు ఎక్కిరాల కృష్ణమాచార్యులు



మల్లాది కైలాసనాథ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధ్యాత్మిక రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన వరల్డ్ టీచర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్యులు నేటి తరానికి ఆదర్శ గురువని సుప్రసిద్ధ ప్రవచనకర్త మల్లాది కైలాసనాథ్ అన్నారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో గురుపౌర్ణమి సందర్భంగా 'ఎక్కిరాల కృష్ణమాచార్య జీవితం– విశేషాలు' అనే అంశంపై ధార్మికోపన్యాసం చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కైలాసనాథ్ మాట్లాడుతూ ఎక్కిరాల కృష్ణమాచార్య హిందూ కళాశాలలో చదివి, అక్కడే తెలుగు అధ్యాపకునిగా పని చేశారని వివరించారు. ఆధ్యాత్మిక రంగంలో విశేష ఖ్యాతి గడించిన కృష్ణమాచార్య ప్రవచనం, రచన, జ్యోతిష్యం, సామాజికసేవ తదితర రంగాల్లో బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి పొందారని తెలిపారు. కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా విదేశాల్లో శిష్య పరంపర ఆయనకు ఉందని వివరించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఎక్కిరాల కృష్ణమాచార్యతో తనకు గల అనుబంధాన్ని, ఆయన జీవిత విశేషాలను వివరించారు. ఈసందర్భంగా మల్లాది కైలాసనాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి, పూర్వ కార్యదర్శి ఎంవీఆర్కే ముత్యాలు, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, విద్యా విషయక సమన్వయకర్త డాక్టర్ కె.కాళిదాసు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, అధ్యాపకులు ఆలూరి నటరాజకుమారి పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: కోర్టు ఆదేశాలు లేకుండా బ్యాంకు సిబ్బంది న్యాయవాదులను వెంట బెట్టుకుని వచ్చి ఇంటి బయట గేటు తాళం పగులగొట్టి అక్రమంగా ప్రవేశించిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తారకరామానగర్‌లోని హైమావతి నివాసాన్ని విజయకుమార్ కొనుగోలు చేశాడు. అయితే హైమావతి డబ్బులు తీసుకుని రిజిస్టార్ చేయలేదు. విజయకుమార్ రిజిస్ట్రారు చేయాలంటూ కోర్టులో కేసు వేశాడు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈనేపథ్యంలో శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది, న్యాయవాదులను వెంట తీసుకుని ఇంటి గేటు తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించారు. సమాచారం తెలుసుకున్న విజయకుమార్ వారిని ప్రశ్నించగా, ఇల్లు బ్యాంకు తాకట్టులో ఉందని వారు తెలిపారు. అయితే వారి వద్ద కోర్టు ఆర్డర్లు లేవు. విజయకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విలేకరిని వృత్తిపరంగా విమర్శిస్తూ వార్త పెట్టిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..విలేకరి అరుణ్‌పై ఓ వ్యక్తి వృత్తిపరంగా విమర్శిస్తూ జర్నలిస్టు డైరీలో వార్త ప్రచురితమైనట్లు పోస్టు పెట్టాడు. అరుణ్ జర్నలిస్టు డైరీ పత్రిక నిర్వాహకులను సంప్రదించాడు. పత్రిక నిర్వాహకులు తమ పత్రికలో అటువంటి కథనం ఏదీ ప్రచురితం కాలేదని సమాధానం ఇచ్చారు. దీనిపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసం చేసిన వారిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ప్రభుత్వ సబ్సిడీతో కారు ఇప్పిస్తామని ఇద్దరు వ్యక్తులు ఓ వ్యక్తిని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కేవీపీ కాలనీకి చెందిన దారపనేని శ్రీహరికి అరుంధతీనగర్‌కు చెందిన కొండవీటి రవీంద్రబాబు, కోయరపాలేనికి చెందిన నాగరాజులతో పరిచయం ఉంది. ఇద్దరు ప్రభుత్వ పథకం కింద 45 శాతం సబ్సిడీతో కారు ఇప్పిస్తామని శ్రీహరిని నమ్మబలికారు. శ్రీహరి అందుకు ఇరువురికి రూ.1.50 లక్షలు చెల్లించాడు. అనంతరం వారు కారు ఇప్పించలేదు. శ్రీహరి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కలకు కు.ని. ఆపరేషన్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటి రేబిస్ టీకాలు చేయుటకు శాశ్వత కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని... దీనికి ప్రజలు, జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నగరంలో ర్యాబీస్ లక్షణాలతో వీధి కుక్కలను గుర్తిస్తే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103కి కాల్ చేసి వివరాలు అందిస్తే, ప్రాధాన్య క్రమంలో వీధి కుక్కలను పట్టుకొని యాంటి ర్యాబీస్ వ్యాక్సిన్, ఆపరేషన్లు చేయడం జరుగుతుందని చెప్పారు.

అడిగోపుల వెంకటరత్నం మృతికి సంతాపం

లక్ష్మీపురం: ప్రముఖ అభ్యుదయ కవి అడిగోపుల వెంకటరత్నం మృతికి సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వెంకటరత్నం నాగార్జున యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగం చేస్తూనే అనేక ప్రజా సమస్యలపై కవితలు రాసేవారని గుర్తుచేశారు. ఆ కవితలు సామాజిక చైతన్యంతో శ్రామికులను కదిలించే విధంగా ఉండేవని, అనేక ఉద్యమాలకు అండదండలుగా ఉండేవారన్నారు. రిటైర్డు అయిన అనంతరం తిరుపతిలో ఉంటూ మృతి చెందినట్లు చెప్పారు. ఆయన మృతి అభ్యుదయ ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు.

VACANCY
An established, leading construction & Real Estate company at Guntur.
Sr. Accounts Executive: B.Com, M.Com with 5 to 10 Years Experience, Sound Accounting Knowledge, Well versed with Tally ERP-9 and Tally -Prime Packages, Preparation of Payment/ Journal Vouchers, Sub-Cons Bills, Bank Reconciliation- Reconciliation of Debtors/ Creditors Accounts.etc..,
Accounts Manager: B.Com, M.com, CA - Inter, M.B.A -Finance with 10 to 20 Years Experience, Sound Accounting Knowledge, Well versed with Tally ERP-9 and Tally Prime Packages, Bank Reconciliation- Head Office- Branch -Reconciliations, Preparation of Monthly / Quarterly TDS, GST etc.. Data-Tax Payments, Finalization of Accounts- Preparation of Financial Statements, P & L, Balance Sheet, Tax Planning.
Salary will be commensurate with experience and knowledge
Phone: 91000 71734, 94901 15118
Email: hr@bajrangurban.com



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com